శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:45 సూర్యాస్తమయం - సా. 6:15 తిథిః పంచమి తె. 4:54ం వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా ఉ. 7:30ం వరకు యోగం శూల ఉ. 8:51 వరకు కరణం కౌలవ మ. 3:34 వరకు తైతుల తె. 4:54ం వరకు వర్జ్యం మ. 1:32 నుండి మ. 3:20 వరకు దుర్ముహూర్తం మ. 12:53 నుండి మ. 1:38 వరకు మ. 3:10 నుండి మ. 3:56 వరకు రాహుకాలం ఉ. 8:11 నుండి ఉ. 9:37 వరకు యమగండం ఉ. 11:04 నుండి మ. 12:30 వరకు గుళికాకాలం మ. 1:56 నుండి మ. 3:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:09 నుండి తె. 5:57 వరకు అమృత ఘడియలు రా. 12:45 నుండి రా. 2:33 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు

e-paper

# ఈ -కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ..
హీరోగా ఎవరంటే?
సినీ కబుర్లు



సోమవారం | 17-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com



జాతీయ కోచ్‌గా భారత దిగ్గజ షూటర్ 6



కాంగ్రెస్ చోద్యం చూస్తుంది తప్ప.. ఏపీని అడ్డుకోవట్లేదు 2



ఏటా లక్ష మందికి విదేశాల్లో ఉపాధి

వృద్ధుల సంరక్షణ కార్యకలాపాల్లో నియామకం

ఎన్ఎస్‌డీసీ సీఈవో వేదమణి తివారీ 4

## అధికారులు ఏసీ రూములు

# వదలడం లేదు

### ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు అధికారులు ఇష్టపడడం లేదని సీఎం అసహనం

- "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరు
- రచయిత ఎం. గోపాలకృష్ణ సివిల్ సర్వెంట్‌గా ఎదుర్కొన్న సవాళ్లను, విజయాలను గుర్తు చేసిన రేవంత్
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ పుస్తకం చదివి ప్రజల కోసం సేవ చేయాలని సూచన
- అధికారులు ప్రజాక్షేత్రంలో తిరిగితేనే వారి అవసరాలు స్వయంగా తెలుసుకోగలరని స్పష్టం
- శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్‌ల వంటి నిబద్ధత గల అధికారులను ఆదర్శంగా తీసుకోవాలని సూచన
- ఏసీ గదుల్లో కూర్చోకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా చూడాలని హెచ్చరిక
- గతంలో ఐఏఎస్ అధికారులు ప్రజలతో మమేకమై ఉండేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని ఆవేదన
- అధికారులు సమర్పణ భావంతో పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్య



*సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికారుల మీద ఫైర్ అయ్యారు. కొందరు అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళడానికి ఇష్టపడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి- ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్" అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.*


**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 16 : పుస్తకావిష్కరణ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి" పుస్తకంలో తాను సివిల్ సర్వెంట్ గా ప్రజల కోసం ఏమేం చేశారో.. ఎలాంటి కష్టాలు ఎదుర్కొని, విజయాలు సాధించారో పొందుపరిచారని అన్నారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి ఈ పుస్తకాన్ని చదివి.. గోపాలకృష్ణ లాగ ప్రజల బాగు కోసం పాటుపడాలని సూచించారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఎంత తిరిగితే (మిగతా 2 వ పేజీలో)

## టెక్స్‌టైల్ ఎగుమతుల్ని 9 లక్షల కోట్లకు

# పెంచడమే లక్ష్యం

- ఢిల్లీలో భారత్ టెక్స్ 2025లో ప్రధాని మోడీ
- ఫ్యాషన్ వ్యర్థాలపై ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం
- ఖాదీ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వాలని పిలుపు
- ఫాస్ట్ ఫ్యాషన్ వల్ల ప్రతినెలా కోట్లాది బట్టలు వ్యర్థమవుతున్నాయి
- ఫ్యాషన్ వ్యర్థాలు 2030 నాటికి 148 మిలియన్ టన్నులకు చేరుతాయని అంచనా
- భారతదేశంలో వస్త్ర రీసైక్లింగ్‌లో ఉన్న నైపుణ్యాలను గ్లోబల్ మార్కెట్‌కు విస్తరించాలనే లక్ష్యం



*భారత ప్రధాని నరేంద్ర మోడీ..ఆదివారం సాయంత్రం.. ఢిల్లీలోని భారత్ టెక్స్ 2025లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యాషన్ వ్యర్థాల పై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ రోజు ఖాదీ అభివృద్ధి చెందుతుంది.ప్రపంచ ప్రజలను ఆకర్షించే విధంగా మనం దానిని మరింత ప్రోత్సహించాలి. స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్నప్పుడు ఇలాంటి ఉద్యమమే జరిగింది. కానీ ఇప్పుడు ఖాదీ ఫ్యాషన్ ప్రపంచంలో ముఖ్యం అయిందని ప్రధాని అన్నారు.*

**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 16 : అలాగే ఫాస్ట్ ఫ్యాషన్ పై ప్రధాని మోడీ స్పందిస్తూ.. ఫాస్ట్ ఫ్యాషన్ వ్యర్థాలు, వస్త్ర వ్యర్థాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మన వస్త్ర పరిశ్రమ ఈ ఆందోళనను అవకాశంగా మార్చగలదని చెప్పారు. వేగంగా అలవాటు పడుతున్న కొత్త ఫ్యాషన్ వల్ల.. ప్రస్తుతం ప్రపంచంలో ప్రతినెలా కోట్లాది బట్టలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందులో అధిక భాగం ఫాస్ట్ ఫ్యాషన్ వేస్ట్.. ఫ్యాషన్, ట్రెండ్స్‌లో వచ్చిన మార్పుల వల్ల ప్రజలు ధరించడం మానేసిన దుస్తులు ఉన్నాయి. ఈ బట్టలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో పారేస్తున్నారు.ఇది పర్యావరణ, జీవావరణ శాస్త్రానికి కూడా పెను ముప్పు తెచ్చిపెడుతోంది. (మిగతా 2 వ పేజీలో)

## అంత మాత్రాన తప్పించుకుంటారనుకుంటే పొరపాటే

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో కిషన్ రెడ్డి పర్యటన
- ప్రధాని మోడీపై ఆరోపణలతో కాంగ్రెస్ తమ వైఫల్యాలను కప్పిపుచ్చలేరని వ్యాఖ్య
- ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపాటు
- రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సాయం, పెంచిన పింఛన్లు అమలు కాలేదని ఆరోపణ
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం రేవంత్ మోడీ కులంపై వ్యాఖ్యలు చేశారని విమర్శ
- గత ప్రభుత్వ నోటిఫికేషన్లనే అమలు చేసి కొత్తగా ఉద్యోగాలిచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపు
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా
- ఒక రాష్ట్ర సీఎం వారానికోసారి ఢిల్లీ వెళ్లడం కేవలం సీటు కాపాడుకోవడానికేనని ఆరోపణ

**ఈ-కబురు,వరంగల్**

ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని మోడీ, కేంద్రంపై విషం కక్కినంత మాత్రాన వైఫల్యాల నుంచి తప్పించుకుంటామనుకుంటే.. పొరబడినట్లే అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని.. (మిగతా 2 వ పేజీలో)





2

## కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే ఏం చేస్తున్నారు..

- సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- కృష్ణా జలాలను అడ్డూ అదుపూ లేకుండా ఏపీ తరలించుకుంటోంది
- మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి 10,000 క్యూసెక్కుల నీరు తరలింపు
- రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఉందని ప్రశ్న

## రాజీవ్ గాంధీ హిందువే కాదు

- ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్సీ
- ఫిరోజ్ పూర్వీకులు ముస్లిం సంతతికి చెందిన వారు
- రాజీవ్ గాంధీ భార్య సోనియా ఇటలీ దేశ క్రైస్తవురాలు
- మరి రాహుల్ గాంధీ హిందువు ఎట్లా అవుతారు?
- కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలి
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఇస్తే,అందులో 10 శాతం ముస్లింలకు పోతాయి
- ఈ లెక్కన బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగినట్లే
- బీసీలను మోసం చేసేందుకే కాంగ్రెస్ కులగణన పేరుతో కుట్ర
- కాంగ్రెస్ నేతలకు కౌంటర్ ఇచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**ఈ-కబురు,కరీంనగర్**

ఫిబ్రవరి 16 : రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వదేశీ మేళా" ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండి సంజయ్ దాదాపు రెండు గంటలకుపైగా అక్కడే గడిపారు. (మిగతా 2 వ పేజీలో)

# కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే..ఏం చేస్తున్నారు..

- ఈ వాటర్ ఇయర్‌లో 646 టీఎంసీలు తరలించినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శ
- సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉన్నా ఏపీ ఇష్టారాజ్యంగా నీరు తరలిస్తున్నదని ఆరోపణ
- తెలంగాణ తాగునీటి అవసరాలకు అవసరమైన నీటిని నిల్వ ఉంచడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- వేసవి ఇంకా పూర్తిగా రాకముందే రైతులు నీటి కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి
- ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, కృష్ణా బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్



**ఈ-కబురు, హైదరాబాద్**


ఫిబ్రవరి 16 : తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు.'ఈ వాటర్ ఇయర్ లోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా అని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని.. వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని మండిపడ్డారు.

శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని.. అంటే బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బోర్డు పై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు.

మరోవైపు వేసవి పూర్తిగా మొదలు కాలేదు తెలంగాణ రైతులు నీళ్ళ కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు అన్నారు.

ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందని తెలిపారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్..
# హరీష్ రావు పీఏ అరెస్ట్!

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 16 : తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు పీఏ వంశీకృష్ణతో సహా ముగ్గురు అరెస్ట్ అయ్యారు.సిద్ధిపేట్ జిల్లా, నియోజకవర్గానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫోన్‌ను ట్యాపింగ్ చేసి బెదిరింపులు, వేధింపులకు గురిచేసిన ఫిర్యాదుకు సంబంధించిన కేసులో పంజాగుట్ట పోలీసులు వేగం పెంచారు. ఓ రైతుకు తెలీకుండా అతని డాక్యుమెంట్స్‌తో హరీష్ రావు పీఏ వంశీకృష్ణ సిమ్‌కార్డు కొనుగోలు చేశారు. ఆ సిమ్‌ను వినియోగించి చక్రధర్ గౌడ్‌కు బెదిరింపు కాల్స్ చేసి వసూళ్లకు పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్, బెదిరింపులపై చక్రధర్ గౌడ్ గతేడాది పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు నిందితుల్ని తాజాగా అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 28వరకు ముగ్గురికి రిమాండ్ విధించారు. కాగా, ఇదే కేసులో ఏ-1గా హరీష్ రావు,ఏ-2గా రాధాకిషన్ రావులు ఉన్నారు.

# అంత మాత్రాన
## తప్పించుకుంటారనుకుంటే పొరపాటే

(మొదటి పేజీ తరువాయి)



అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు.ఇచ్చిన హామీలన్నింటికినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉ ద్యోగాలు, మహిళలకు రూ.2500 సాయం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెంచిన పింఛన్లు, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఫీజు రియింబర్స్‌మెంట్స్, రుణమాఫీ ఇలా చెప్పుకుంటూ ఏదీ సక్రమంగా అమలు చేయడం లేదని.. దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని మోడీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని చెప్పారు.

గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను భర్తీ చేసి.. వారే ఉ ద్యోగాలు ఇచ్చినట్లుగా కాంగ్రెస్ నేతలు డబ్బాలు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు తప్పకుండా బీజేపీ జెండా ఎగరేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా వారానికోసారి ఢిల్లీ వెళ్లడం లేదని.. సీటు కాపాడుకోవానికి ఢిల్లీ వెళ్లి అటెండెన్స్ వేయించుకున్నాడని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చెప్పినట్లు విని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు.. కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ బాటలోనే వెళ్తోందని మండిపడ్డారు.



# కులగణనపై ఎంపీ ఈటల కీలక వ్యాఖ్యలు

- కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనను డ్రామాగా అభివర్ణించిన ఈటల
- 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ సీఎం కూడా లేరని విమర్శ
- కాంగ్రెస్‌ను భూదందాలు, లంచాలకు ప్రాతినిధ్యంగా అభివర్ణించిన ఈటల
- ప్రధాని మోదీపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు చిల్లరగా ఉన్నాయని వ్యాఖ్యానం
- టీచర్లను మోసం చేసిన బీఆర్ఎస్‌కు పోటీ చేసే అర్హత లేదని విమర్శ

**ఈ-కబురు,యాదాద్రి భువనగిరి**

ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన ఒక డ్రామా అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.యాదగిరిగుట్టలో ఆదివారం(ఫిబ్రవరి16) ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.'బీసీ గణనను చట్టబద్ధమైన సంస్థలతో సర్వే చేసి అసెంబ్లీలో చట్ట బద్ధత కల్పించాలి. బీసీ కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు.కులగణనను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు సిద్దంగా ఉ న్నాం. 70ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ సీఎం కూడా లేడు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు, భూ దందాలు,లంచాలు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డబ్బు సంచులతో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నాడు.

ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చిల్లరగా ఉన్నాయి. పట్టభద్రులు, ఉ పాధ్యాయ ఎమ్మెల్సీలో మూడు స్థానాల్లో బీజేపీ గెలుస్తుంది. బీఆర్ఎస్ గతంలో టీచర్లను మోసం చేసి పోటీ చేసే అర్హత కోల్పోయింది'అని ఈటల అన్నారు.

# కాంగ్రెస్ చోద్యం చూస్తుంది తప్ప.. ఏపీని అడ్డుకోవట్లేదు

- ఏపీ యథేచ్ఛగా కృష్ణా జలాలను తరలిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల పొలాలు ఎండిపోతున్నాయని ఆరోపణ
- కేఆర్ఎంబి పరిధిలో త్రీ-మెన్ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శ
- "జాగో రైతున్న జాగో.. జాగో తెలంగాణ జాగో" అంటూ ప్రజలకు పిలుపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 16 : ఏపీ ప్రభుత్వం యథేచ్ఛగా కృష్ణా జలాలను తరలిస్తుంటే తెలంగాణ లోని కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడె ంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల నుంచి ఏపీ ఇప్పటికే 646టీఎం సీలు వినియోగించుకుందని తెలిపారు. సాగర్ కుడి కాలువ ద్వారా గత మూడు నెలలుగా రోజుకు 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో జలాలలను తరలిస్తుందని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ సర్కార్ నిలువరించడం లేదని విమర్శించారు.నది జలాలను ఆంధ్రప్రదేశ్ తన్నుకు పోతున్నా బోర్డుకు చలనం లేదని.. రేవంత్ సర్కార్ నోరె త్తడం లేదని కేటీఆర్ విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల్లో బొట్టును బొట్టును కాపాడు తూ బీడు భూములను కేసీఆర్ సస్యశ్యామలం చేస్తే.. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పంటపొలాలను ఎండబెట్టిందని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం కోసం ఏర్పడ్డ రాష్ట్రంలో ఒక్కొక్కొటిగా అన్నింటిని



కాంగ్రెస్ ప్రభుత్వం గంగలో కలుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చేది వేసవి కాలమని.. తాగునీళ్లకు, సాగు నీళ్లకు కష్టం అని తెలిసి కూడా గాలిమోటర్‌లో ఢిల్లీ ట్రిప్పులు కొడ్తున్న ముఖ్యమంత్రికి అన్నదాతల గోస ఏం తెలుస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. కేఆర్ఎంబి పరిధిలోని త్రీ మెన్ కమిటీ దిక్కులేదని విమర్శించారు. సాగర్, శ్రీశైలంలో నీళ్లు అడుగంటి పొలాలు ఎండుతున్నా నీమ్మకు నీరెత్తినట్టున్నగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. జాగో రైతున్న జాగో.. జాగో తెలంగాణ జాగో అని పిలుపునిచ్చారు.

## టెక్స్‌టైల్ ఎగుమతుల్ని 9 లక్షల కోట్లకు
# పెంచడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



భారతదేశంలో రీసైక్లింగ్, వస్త్ర రీసైక్లింగ్ లో చాలా వైవిధ్యమైన నైపుణ్యాలు ఉన్నాయి. ఒక అంచనా ప్రకారం.. 2030 నాటికి ఫ్యాషన్ వ్యర్థాలు 148 మిలియన్ టన్నుల మేర చేరుకోనున్నాయి. ఈ రోజు, వస్త్ర వ్యర్థాలలో 1/4 వ భాగం కూడా రీ సైకిల్ చేయబడటం లేదు. మన వస్త్ర పరిశ్రమ ఈ ఆందోళనను ఒక అవకాశంగా మార్చిడి చేయగలదు. భారతదేశంలో వస్త్ర రీసైక్లింగ్ లో అనేక సాంప్రదాయ నైపుణ్యాలు, ప్రత్యేకంగా అప్‌సైక్లింగ్ పద్ధతులు ఉన్నాయి. ఇక్కడ మిగిలిన, పాత వస్త్రాల నుండి తయారు చేసిన ఉప్పు పడకలు ఉన్నాయి. వూవర్స్ ఇళ్ల మహిళలు ఇలాంటి వస్త్రాలతో అనేక రకాలుగా పడకలు, కవచాలు తయారు చేస్తారు. మనం ఈ సంప్రదాయ పద్ధతుల్లో కొత్త ఆవిష్కరణలను తీసుకుని వాటిని గ్లోబల్ మార్కెట్ కు టెక్స్‌టైల్ ఎగుమతుల్ని 9లక్షల కోట్లకు పెంచడమే టార్గెట్: ప్రధాని మోదీతీసుకెళ్లవచ్చని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు.



## అధికారులు ఏసీ రూములు
# వదలడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

అంత మంచిది అని, ప్రజల అవసరాలు ఏంటో స్వయంగా తెలుసుకోవచ్చని అన్నారు.శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్ లాంటి అధికారులను ప్రతిక్షణం అధికారులు గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. అయితే కొంతమంది అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళకుండా ఏసీ గదులకు మాత్రమే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశ పెట్టినా అవి అధికారుల ద్వారా మాత్రమే ప్రజలకు చేరతాయని, అధికారులు ఏసీ గదులు వదిలి రాకపోతే అవి ఏ విధంగా వారికి అందుతాయని ప్రశ్నించారు.గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారని..గతంలో అధికారులు, రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే అందులోని లోతుపాతులు, లాభ నష్టాలను వివరించేవారని అన్నారు. కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయిందన్నారు.అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

# రాజీవ్ గాంధీ హిందువే కాదు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి స్టాల్‌ను సందర్శిస్తూ స్వదేశీ ఉత్పత్తులను తిలకించారు. స్వదేశీ జాగరణ మంచ్ చేస్తున్న క్రుషిని అభినందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల మాట్లాడిన మాటలు టీవీల్లో చూసిన. తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని, రాజీవ్ గాంధీ హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్ గాంధీ కూడా హిందువేనని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.. అసలు రాజీవ్ గాంధీ హిందువు ఎట్లా అవుతాడు. రాజీవ్ గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ మతస్థుడు. పర్సియాలోని ముస్లిం సంతతికి చెందిన వాళ్ల పూర్వీకులు ఇండియాకు వచ్చి పార్శీలుగా మారారు. ఫిరోజ్ జహంగీర్ ఖాన్ మతమే రాజీవ్ గాంధీకి వర్తిస్తుంది. కాబట్టి రాజీవ్ గాంధీ అసలు హిందూ కానేకాదు. ముస్లిం మూలాలున్న పార్శీ మతస్తుడు. టెన్ జన్ పథ్ లోని రాహుల్ గాంధీ కుటుంబానికి కులం, మతం, జాతి, దేశం లేదు... కానీ మోదీ పక్కా ఇండియన్. మోదీకి విదేశీయులే సాష్టాంగ నమస్కారం చేస్తున్నారు. విదేశాల్లో ప్రతి భారతీయుడు గర్వంగా ఇండియన్ ఇని కాలర్ ఎగరేసి తలెత్తుకుని తిరిగేలా చేస్తున్నారు.బీసీ కుల గణన పేరుతో హిందువులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ఒక వర్గానికి, మతానికి కొమ్ము కాసేందుకు కాంగ్రెస్ నేతలు బీసీల జనాభా తగ్గించే కుట్ర చేస్తున్నరు. 10 శాతమున్న ముస్లింలను బీసీల్లో కలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి... అందులో 10 శాతం ముస్లింలకే చెందుతాయి. ఈ లెక్కన బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తాయి. మరి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తీరువల్ల బీసీ న్యాయం కంటే అన్యాయం ఎక్కువ జరుగుతోంది.మహారాష్ట్రలో మాదిరిగా మత మార్పిడులు, లవ్ జిహాదీలపై చట్టం తీసుకురావాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అట్లాంటి చట్టమే తెలంగాణలోనూ తీసుకురావాలి. అంతే తప్ప ముస్లింలను బీసీ జాబితాలో కలిపి కేంద్రానికి పంపితే... ఆ జాబితాను కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. ఇందులో ఎలాంటి మొహమాటం లేనేలేదు. హిందూ ధర్మ సమాజం కోసం నిరంతరం పనిచేస్తాం. మమ్ముల్ని మతతత్వ వాదులుగా ముద్రవేసే భయపడే ప్రసక్తే లేదు. ఇకనైనా బీసీ జాబితాలో నుండి ముస్లింల జనాభాను తీసేసి కేంద్రానికి పంపిస్తే తప్పనిసరిగా ఆ జాబితా ఆమోదం పొందేలా చేస్తాం...అని వ్యాఖ్యానించారు.



## భారత్‌లో ఓటింగ్‌ను పెంచేందుకంటూ
# అమెరికా నిధులు..
### కత్తెరేసిన డోజ్

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 16 : అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృథా వ్యయం కట్టడే లక్ష్యంగా రూపొందించిన డోజ్ విభాగం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా వివిధ దేశాలకు అమెరికా అందించే నిధులకు కోత విధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లను రద్దు చేసినట్లు పేర్కొంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.

### ఈ కోతలపై స్పందించిన భాజపా..

డోజ్ విభాగం తాజా నిర్ణయంపై భాజపా నేత అమిత్ మాలవీయ స్పందించారు. 'ఓటర్లు సంఖ్య పెంచేందుకు 21 మిలియన్ డాలర్ల?. ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో ప్రత్యేక్ష భాగం కాదు. దీని నుంచి ఎవరు లాభపడుతున్నారు?. అధికార పార్టీ మాత్రం కాదు' అని మాలవీయ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

### బంగ్లాదేశ్‌కు 29 మిలియన్ డాలర్లు..

బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు అందిస్తున్న 29 మిలియన్ డాలర్లకు కూడా డోజ్ కోత విధించింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా అనంతరం మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇక నేపాల్, కంబోడియా, ఆసియా వంటి పలు దేశాలకు కూడా వివిధ రూపాల్లో అమెరికా అందించే సాయాన్ని నిలిపివేశారు.




# ఇతర దేశాలనూ గౌరవించండి

**ఈ-కబురు,మ్యూనిచ్**

ఫిబ్రవరి 16 : తాము మాత్రమే ప్రజాస్వామ్య విలువల్ని పాటిస్తామని, మిగతా దేశాలకు వాటి గురించి కొత్తగా నేర్పిస్తున్నట్లు తరచూ హితబోధ చేసే పశ్చిమదేశాలకు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గట్టి సమాధానమిచ్చారు. జర్మనీలోని మ్యూనిచ్ నగరంలో జరుగుతున్న భద్రతా సదస్సులో "ఓటేసేందుకు జీవించే ఉందాం: ప్రజాస్వామ్య సవాళ్లను ఎదుర్కొందాం"అంశంపై బృందచర్చలో ఆయన ప్రసంగించారు.

తమ దేశాల్లో మాత్రమే ప్రజాస్వామ్యం ఉన్నట్లు పశ్చిమ దేశాలు భావిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా పశ్చిమదేశాల వైఖరిని ఖండిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. "ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని మీరు(పశ్చిమదేశాలు) నిజంగా భావిస్తే వివిధ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న ప్రజాస్వామ్య విధానాలను మీరూ ఆదరించాల్సిందే.

కుండబద్దలు కొట్టినట్లు చెప్పాలంటే పశ్చిమదేశాలు తమ దేశాల్లో మాత్రమే ప్రజాస్వామ్యం ఉన్నట్లు మాట్లాడుతున్నాయి. గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రజాస్వామ్యేతర విధానాలను ఈ పశ్చిమదేశాలు రుద్దుతున్నాయి. పశ్చిమదేశాలు సొంత గడ్డపై ప్రజాస్వామ్యానికి ఎంత విలువ ఇస్తాయో గ్లోబల్ సౌత్ దేశాల ప్రజాస్వామ్యానికీ అంతే విలువ ఇవ్వాలి. ఇంటి విధానాలను బయటా ఆచరించి చూపండి"అని వ్యాఖ్యానించారు. ఇతర దేశాల్లోని విజయాలను గ్లోబల్ సౌత్ దేశాలూ అందిపుచ్చుకుంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఆలోపే తెలంగాణకు కొత్త అధ్యక్షుడు వస్తడు..

- కులగణనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం - కిషన్ రెడ్డి విమర్శ
- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు,
- రాహుల్ గాంధీ కులంపై సర్వే అవసరం లేదని వ్యాఖ్య
- త్వరలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు
- స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే నియామకం
- బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాల్సిన అవసరం లేదని స్పష్టం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య అంతర్గత సంబంధం ఉందని ఆరోపణ



**ఈ-కబురు,వరంగల్**

ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో కులగణన చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. ఆదివారం ఆయన వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ఏ ఒక్క బీసీ సంఘం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే కరెక్ట్ అని అనట్లేదని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ సపోర్ట్ చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సర్వే పూర్తయి, బీసీ సంఘాలు సమర్థిస్తే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం చేపిస్తామని కీలక ప్రకటన చేశారు.రాహుల్ గాంధీ కులం గురించి సర్వే చేయాల్సిన అవసరం లేదని.. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే చేయాలని హితవు పలిశారు.త్వరలో తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడు రాబోతున్నారు.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీజేపీకి నూతన రాష్ట్ర అధ్యక్షుడు వస్తాడని కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. బిజీ షెడ్యూల్ వల్ల రాష్ట్ర అధ్యక్షుడి నియామకం లేట్ అవుతోందని అన్నారు. బీఆర్ఎస్‌తో కలవాల్సిన అవసరం తమకు లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను పెట్టేందుకు భయపడుతోందని విమర్శించారు. ఆ రెండు పార్టీల మధ్య అంతర్గత సంబంధం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదేబాటలో నడుస్తున్నారని అన్నారు. అందినకాడికి అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీసే పరిస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. భూములు అమ్మడం, సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ పనిచేస్తోందని మండిపడ్డారు.వనరులు సమకూర్చుకునే అంశంలో ప్రణాళిక లేదు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ కూడా లేదు. గుడ్డెద్దు చేనులో పడ్డట్లు కాంగ్రెస్ పరిపాలన ఉంది. ఘాటుగా, ఆవేశంగా మాట్లాడితే ప్రజలు ఎక్కువ రోజులు భరించరు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు, దొందూ దొందే అని కిషన్ రెడ్డి అన్నారు.



## సునీత,విల్మోర్‌లకు
# 'గ్రావిటీ' భయం..!

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 16 : నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్,బుచ్ విల్మోర్‌లు అంతరిక్షం నుంచి మార్చి 19న భూమి మీదకు బయలుదేరనున్నారు. గతేడాది జూన్‌లో అంతర్జాతీయ స్పేస్‌స్టేషన్(ఐఎస్ఎస్)కు వెళ్లిన వారిద్దరు అనుకోని పరిస్థితుల్లో ఎనిమిది నెలలపాటు అక్కడే ఉండిపోయారు. అయితే వ్యోమగాములిద్దరు భూమి మీదకు వచ్చిన తర్వాత పలు రకాల సమస్యలను ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది. జీరో గ్రావిటీ నుంచి భారీ గురుత్వాకర్షణ కలిగిన భూమి వాతావరణంలోకి 8 నెలల తర్వాత వారు రానుండడమే ఇందుకు కారణం. తాము భూమి మీదకు వచ్చిన తర్వాత చిన్న పెన్సిల్‌ను లేపినా పెద్ద బరువులు ఎత్తి వ్యాయామం చేసిన ఫీలింగే ఉంటుందని విల్మోర్ మీడియాకు తెలిపారు.'ఇక్కడి నుంచి భూమి మీదకు వచ్చిన తర్వాత గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది.





# భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా కన్యగారి నర్సింహ్మారెడ్డి

## నిర్మాణ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి : నర్సింహ్మారెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

ఫిబ్రవరి 16 : భవన నిర్మాణ కార్మిక సంఘం(బీఓసీ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ సీపీఐ నాయకులు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభ ఆదివారం జూబ్లీహిల్స్ లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియం హాలులో దాసరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జనిరత్నాకర్ రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. భవన నిర్మాణ కార్మిక సంఘం(బీఓసీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా దాసరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కన్యగారి నర్సింహ్మారెడ్డిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు 41 మందితో నూతన జిల్లా కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శేరిలింగంపల్లికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు కన్యగారి నర్సింహ్మారెడ్డి ఎన్నిక కావడంపై నియోజకవర్గ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ తనను భవన నిర్మాణ కార్మిక సంఘం(బీఓసీ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి



కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు దేశ సంపదకు పునాదులని, వారి భద్రతకు గ్యారంటీ, ప్రాణాలకు విలువ లేకుండా పోయిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రాబోయే కాలంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. లేబర్ అడ్డాల వద్ద కనీస సౌకర్యాలు లేవని, భవన నిర్మాణ కార్మికులకు కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాడుతామని అన్నారు. కార్మికులు ప్రమాదాల్లో చనిపోతే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రెసియా చెల్లించాలని డిమాండ్ చేశారు.




# న్యూఢిల్లీలో మహా విషాదం..
## కుంభమేళా దగ్గర పడుతుండటంతో పోటెత్తిన భక్తజనం..
### రైలు కోసం ప్రయాణికులు ఒక్కసారిగా తోసుకోవడంతో తొక్కిసలాట..18 మంది మృత్యువాత..

**ఈ-కబురు,న్యూఢిల్లీ:**

ఫిబ్రవరి 16 : న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు.పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. కుంభమేళా ముగింపు దశకు చేరుకుంటుండటంతో సందర్శించేందుకు భక్తులు ఒక్కసారిగా పోటెత్తడంతో ఈ దుర్ఘటన జరిగింది. ప్రయాగ్‌రాజ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు 14వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఉండటంతో కుంభమేళాకు వెళ్లే భక్తులు అక్కడకు చేరుకున్నారు. అయితే, కుంభమేళాకే వెళ్లే స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు కూడా అదే సమయంలో 12, 13, 14 నంబర్ ప్లాట్‌ఫ్లాంపై ఉండటంతో ఒక్కసారిగా రద్దీ పెరిగి తొక్కిసలాట చోటుచేసుకుంది. అక్కడ ఏం జరుగుతుందో అర్థంకాని బీభత్స వాతావరణం నెలకొంది.వేల సంఖ్యలో తోసుకోవడంతో కిందపడిపోయిన వారు కొందరు చనిపోగా మరికొందరు తీవ్రగాయాల పాలయ్యారు.పోలీసులు ఎంత కట్టడి చేసినా తోపులాటను ఆపలేకపోయారు. ఆర్తనాదాలు, హాహాకారాలతో రైల్వే స్టేషన్ దద్దరిల్లిపోయింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తొక్కిసలాట అదుపు చేయడానికి , మృతులను బయటకు తీయడానికి, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు.తొక్కిసలాట ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాటలో పలువురు మృతి చెందినట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ధ్రువీకరించారు. రద్దీని అంచనా వేశామని, అయితే అంతా క్షణాల్లో జరిగిపోయింది రైల్వే పేర్కొంది.



బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గృహ రుణ గ్రహీతలకు తీపి కబురు చెప్పింది. రుణ రేట్లను తగ్గించినట్లు బ్యాంక్ ప్రకటన పేర్కొంది. దీనితో గృహ రుణ గ్రహీతలకు ఈజీ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్ల (ఈఎంఐ) భారం తగ్గనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను ఇటీవలే పావుశాతం తగ్గించిన నేపథ్యంలో (6.5 శాతం నుంచి 6.25 శాతానికి) ఎస్‌బీఐ తాజా నిర్ణయం తీసుకుంది. తగ్గించిన రేట్లు ఇలా...




# రుణగ్రహీతలకు శుభవార్త

## ఈబీఎల్ఆర్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఎస్‌బీఐ దీనితో తగ్గనున్న ఈఎంఐల భారం

]వివిధ రుణాలకు వర్తించే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్ (ఈబీఎల్ఆర్), అలాగే రెపో ఆధారిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 25 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గించింది. ఈ తగ్గింపు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది.

]అయితే బ్యాంక్ మార్జినల్ కాస్ట్%-%బేస్డ్ లెండింగ్ రేట్లు (ఎంసీఎల్ఆర్), బేస్ రేట్, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్‌ను (బీపీఎల్ఆర్) యథాతథంగా కొనసాగించింది.

### రెపో ఆధారిత రుణల విషయానికి వస్తే...

రెపో ఆధారిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) ప్రత్యక్షంగా రెపో రేటుకు అనుసంధానమై ఉ ంటుంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో ఈ రేటు 8.75 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గుతుంది. దీనితో ఆర్ఎల్ఎల్ఆర్‌కు అనుసంధానమైన గృహ, వాణిజ్య రుణాలు తగ్గుతాయి.

### ఆకర్షణీయం..

ఈబీఎల్ఆర్ లేదా ఆర్ఎల్ఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణ గ్రహీతల రుణ నిబంధనలను బట్టి వారి ఈఎంఐలు లేదా రుణ వ్యవధి తగ్గుతుంది. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపుతో గృహ రుణాలను మరింత ఆకర్షణీయంగా చేస్తూ, ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్‌ను ఎస్‌బీఐ తగ్గించడం కస్టమర్లకు ప్రయోజనం కలిగించే అంశమని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఈ తగ్గిన రుణ రేటు ప్రయోజనాలు పొందడానికి మార్జినల్ కాస్ట్ రుణ రేటు (ఎంసీఎల్ఆర్) కస్టమర్లు తక్కువ వడ్డీరేటు రుణ విధానానికి మారవలసి ఉ ంటుంది.

### 'రుణ' పునఃపరిశీలనకు సూచన...


తాజా రుణ రేట్లు, సంబంధిత పరిణామాల నేపథ్యంలో కొత్త రుణగ్రహీతలు రుణదాతను (బ్యాంక్) ఎంచుకునే ముందు వివిధ బ్యాంకుల రుణ రేట్లను సరిపోల్చుకోవాలని, వారి సామర్థ్యానికి అనువైన రుణ రేట్లను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే రుణగ్రహీతలు తప్పనిసరిగా తమ రుణ ఒప్పందాలను సమీక్షించుకోవాలని వారు సూచిస్తున్నారు.

అవసరమైతే రీఫైనాన్సింగ్ ఎంపికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. సెంట్రల్ బ్యాంక్ రెపో తగ్గింపు నేపథ్యంలో కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి అనేక బ్యాంకులు కూడా తమ రెపో ఆధారిత రుణ రేటును పావు శాతం తగ్గించాయి. ఈ బ్యాంకుల నుండి గృహ రుణ గ్రహీతలు తమ ఈఎంఐలను అలాగే రుణ చెల్లింపు వ్యవధి కాల పరిమితులను సమీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఈబీఎల్ఆర్ అంటే?

ఈబీఎల్ఆర్ అంటే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్. ఎస్‌బీఐ 2019 అక్టోబర్ నుంచి తన ఫ్లోటింగ్ రేటు గృహ రుణాలను అనుసంధానించడానికి ఈబీఎల్ఆర్‌ను ప్రామాణికంగా తీసుకుంది. దీనితో అన్ని ఫ్లోటింగ్ రేట్ హోమ్ లోన్‌లకు వడ్డీ రేట్లు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమవుతాయి. తాజా నిర్ణయంతో గృహ రుణ ఫ్లోటింగ్ రేట్లు తగ్గుతాయన్న మాట. దీనితోపాటు ఈబీఎల్ఆర్‌కు అనుసంధానమైన అన్ని వ్యక్తిగత ఇతర రిటైల్ రుణాలు సైతం దిగివస్తాయి. తాజా నిర్ణయం ప్రకారం ఈబీఎల్ ఆర్ 9.15% నుంచి 8.90 శాతానికి తగ్గింది.

# హ్యుండై ఎగుమతులు 37 లక్షల యూనిట్లు




### తొలి స్థానంలో ఐ10..

గడిచిన 25 ఏళ్లలో భారత్ నుంచి 150కిపైగా దేశాలకు వాహనాలను సరఫరా చేసినట్టు హ్యుండై తెలిపింది. తమిళనాడులో కంపెనీకి తయారీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో ఐ10 మోడల్ ఫ్యామిలీ 15 లక్షల యూనిట్లను దాటి టాప్%-%1లో నిలిచింది. వెర్నా సిరీస్‌లో 5,00,000 యూనిట్లు నమోదయ్యాయి. దక్షిణ కొరియా వెలుపల హ్యుండై అతిపెద్ద ఎగుమతి కేంద్రంగా భారత్‌ను నిలపాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని హ్యుండై మోటార్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్ వెల్లడించారు.

## అతిపెద్ద దిగుమతిదారుగా ఆఫ్రికా p ఐ10 మోడల్ వేరియంట్లదే హవా

వాహన తయారీ సంస్థ హ్యుండై మోటార్ ఇండియా 37 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను భారత్ నుంచి ఎగుమతి చేసి సరికొత్త మైలురాయిని అధిగమించింది. దేశం నుంచి 1999లో కంపెనీ ఎగుమతులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం 60 దేశాలకు వివిధ మోడళ్ల కార్లను సరఫరా చేస్తోంది. 2024లో సంస్థకు సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ అతిపెద్ద ఎగుమతి మార్కెట్లుగా అవతరించాయి. గత ఏడాది హ్యుండై 1,58,686 యూనిట్లు ఎగుమతి చేసి భారత్‌లో ప్యాసింజర్ వెహికిల్స్‌కు అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచింది. ఇక మన దేశం నుంచి హ్యుండై కార్లకు అతిపెద్ద దిగుమతిదారుగా ఆఫ్రికా తొలి స్థానంలో ఉంది. ఇప్పటి వరకు మొత్తం 10 లక్షలకుపైగా వాహనాలను ఆఫ్రికా అందుకుంది.

# ఏటా లక్ష మందికి విదేశాల్లో ఉపాధి

## ఎన్ఎస్‌డీసీ సీఈవో వేద్‌మణి తివారీ

భారత్ నుంచి ఏటా లక్ష మందికి అంతర్జాతీయంగా సంరక్షణ కార్యకలాపాల్లో ఉపాధి కల్పించనున్నట్లు జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సీఈవో 'వేద్ మణి తివారీ' ప్రకటించారు. మరో రెండేళ్ల తర్వాత నుంచి నియామకాలు మొదలవుతాయన్నారు. వృద్ధ జనాభా పెరుగుతున్న దేశాల్లో వారి సంరక్షణ సేవల్లో నియమించనున్నట్టు చెప్పారు.



దేశంలో నిరుద్యోగం గురించి ప్రస్తావించగా.. అధికారిక లెక్కల ప్రకారం ఇది 6.5 శాతంగా ఉందని, అమెరికాలోనూ 4.5 శాతం మంది నిరుద్యోగులు ఉన్నట్టు గుర్తు చేశారు. గడిచిన ఏడాది కాలంలో భారత్ నుంచి 20,000 మంది నిర్మాణ రంగ కార్మికులు ఇజ్రాయెల్‌కు వెళ్లారని చెప్పారు. దేశవ్యాప్తంగా 100 నైపుణ్య మదింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తివారీ తెలిపారు.

"ఇజ్రాయెల్ లేదా జపాన్ లేదా జర్మనీ వెళ్లాలనుకునే వారు ఈ కేంద్రాల వద్ద హాజరు కావాలి. అక్కడ నైపుణ్యాలను పరీక్షించి సర్టిఫికెట్ ఇస్తారు. అప్పుడు వర్క్‌వీసా కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు"అని వివరించారు. ఎన్ఎస్‌డీసీ 4 కోట్ల మందికి శిక్షణ ఇవ్వగా, మూడు నెలల్లోనే 94 లక్షల మందికి ఉపాధి లభించినట్టు తివారీ వెల్లడించారు.

అత్యాధునిక నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ కోసం దేశవ్యాప్తంగా కొత్తగా 50 భవిష్యత్ నైపుణ్య కల్పన కేంద్రాలను, 10 ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. పరిశ్రమల అనుసంధానతతో కూడిన శిక్షణా కార్యక్రమాలు 300కు మించగా, 13 ప్రముఖ టెక్నాలజీలు వీటి పరిధిలో ఉ న్నట్టు చెప్పారు. ఏటా 2 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు.

# నీతా అంబానీకి అరుదైన గౌరవం



రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ నీతా అంబానీకి అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. ఆమె దార్శనిక నాయకత్వం, సమాజానికి చేసిన అసాధారణ సేవకు గుర్తింపుగా మసాచుసెట్స్ విశిష్ట గవర్నర్ ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేసింది. మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలే చేతుల మీదుగా నీతా అంబానీ ఈ ప్రశస్తిని అందుకున్నారు.

మసాచుసెట్స్ విశిష్ట గవర్నర్ ప్రశంసాపత్రం గురించి తెలియజేస్తూ భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్య సంరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, మహిళా సాధికారత వంటి వివిధ రంగాలలో నీతా అంబానీ గణనీయమైన ప్రభావాన్ని చూపారంటూ రిలయన్స్ ఫౌండేషన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా తెలిపింది.

"మా వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీతా అంబానీని దార్శనిక నాయకురాలిగా, వితరణశీలిగా, అసలైన గ్లోబల్ గేమ్‌ఛేంజర్‌గా గుర్తిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలే ప్రతిష్టాత్మక గవర్నర్ ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేశారు" అని రిలయన్స్ ఫౌండేషన్ పోస్ట్‌లో వివరించింది.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో నీతా అంబానీ చేతితో నేసిన అద్భుతమైన శికార్గా బనారసి చీర ధరించి పాల్గొన్నారు. భారతీయ కళా నైపుణ్యానికి ఉదాహరణగా నిలిచే ఈ చీర అధునాతన కడ్వా నేత నైపుణ్యం, సాంప్రదాయ కోన్యా హంగులను సంతరించుకుంది. నీతా అంబానీ ఈ చీరను ధరించడం ద్వారా భారతదేశ కళాత్మక వారసత్వ వైభవాన్ని మరోసారి అంతర్జాతీయంగా చాటారు.



## సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని.. బాషా రేంజ్ ఎలివేషన్

కథానాయిక సాయిపల్లవి ఎంచుకునే కథలు వేటికవే విభిన్నంగా ఉంటాయి. ఏవి పడితే అవి చేసుకుంటూ పోకుండా ప్రాధాన్యమున్న పాత్రల్ని మాత్రమే చేసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల తండేల్ సినిమా చేసింది. ఇందులో మరోసారి తన నటనతో కట్టిపడేసింది. ఇప్పటికే ఈ మూవీ వంద కోట్ల క్లబ్‌లో చేరింది.

**సెల్ఫీ దిగాక..**

ఇకపోతే తండేల్ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ఓ ఈవెంట్‌లో జరిగిన చిన్న సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలకు ముందు జరిగిన తండేల్ జాతర ఈవెంట్‌లో ఓ మహిళా అభిమాని ఎలాగోలా సాయిపల్లవిని చేరుకుంది. తనతో సెల్ఫీ దిగిన అమ్మాయి హీరోయిన్ షేక్‌హ్యాండ్ ఇచ్చింది. దీంతో తెగ సంతోషపడిపోయిన ఆమె సాయిపల్లవి చేతికి ముద్దు పెట్టింది.

**బుజ్జి తల్లికి బాషా రేంజ్ ఎలివేషన్**

ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరలవుతోంది. బాషా సినిమాలో రజనీకాంత్ మాణిక్ బాషాగా మారిన సమయంలో తన అనుచరులంతా కూడా ఆయన చేతిని ముద్దాడుతుంటారు. ఆ సీన్‌తో సాయిపల్లవి క్లిప్‌ను పోలుస్తూ బుజ్జితల్లికి బాషా రేంజ్ ఎలివేషన్ ఇస్తున్నారు. ఇకపోతే సాయిపల్లవి ప్రస్తుతం రామాయణ సినిమాలో నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు.

## శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ.. హీరోగా ఎవరంటే?

పెళ్లి సందడి మూవీతో టాలీవుడ్‌కు పరిచయమైన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ తర్వాత పలు సూపర్ హిట్ చిత్రాలతో మెప్పించింది. ఇటీవల పుష్ప-2 సినిమాలో కిస్సిక్ సాంగ్‌తో అభిమానులను ఓ ఊపు ఊపేసింది. దీంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. దక్షిణాదిలో ఓ ఊపు ఊపేస్తోన్న శ్రీలీలకు బాలీవుడ్‌లోనూ క్రేజీ ఛాన్ కొట్టేసింది. శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోన్న చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ వచ్చేసింది.

బాలీవుడ్ కార్తీక్ ఆ□ర్యన్ సరసన కనిపించనుంది ముద్దుగుమ్మ. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ టీజర్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్, అనురాగ్ బసు ప్రొడక్షన్ బ్యానర్లపై భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మిస్తున్నారు.





## వాటితో జీవితానికి ఎలాంటి ఉపయోగం లేదు - రష్మిక

వరుస సక్సెస్‌లతో దూసుకెళ్తున్న బ్యూటీ, నేషనల్ క్రష్ నటి రష్మిక మందన్నా. మాతృభాష అయిన కన్నడ చిత్రపరిశ్రమలో కథానాయకిగా పరిచయమైంది. ఆ తర్వాత మలయాళం, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటించే స్థాయికి చేరుకున్నారు. ఇటీవల ఈమె తెలుగులో అల్లు అర్జున్ ఫ్యాషన్ నటించిన పుష్ప%-% 2 చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను బద్దలు కొట్టిన విషయం తెలిసిందే. ఆ చిత్రంలో అందం, అభినయంతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అయితే ఇటీవల హిందీలో గుడ్ బై అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రష్మిక మందన్నా ఆ చిత్రం నుంచి ఆశించిన విజయాన్ని సాధించకపోయినా.. అక్కడ వరుసగా అవకాశాలు మాత్ర వస్తూనే ఉన్నాయి. ఆ తర్వాత నటించిన యానిమల్ చిత్రం ఈ కన్నడ బ్యూటీని నేషనల్ క్రష్‌గా మార్చింది. తాజాగా విక్కీ కౌశల్‌తో సరసన ఛావా అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రం ప్రేమికుల రోజు సందర్భంగా శుక్రవారం తెరపైకి వచ్చింది. మొదటి రోజే ఈ సినిమా సక్సెస్ ఫుల్ టాక్ తెచ్చుకుంది.

ఇందులో నటి రష్మిక మహారాణి పాత్రలో తన సత్తాను చాటారు. ఈ సందర్భంగా నేషనల్ క్రష్ వంటి బిరుదులు జీవితంలో ఏ విధంగానూ ఉపకరించవని పేర్కొన్నారు. దీని గురించి రష్మిక ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సినిమాల్లో లభించే బిరుదులు , పేర్లు జీవితంలో ఉపయోగపడవు అన్నారు. అవీ అభిమానుల ఆదరాభిమానాలతో వచ్చేవి అన్నారు. అందుకే అవి కూడా పేర్లు మాత్రమేనని పేర్కొన్నారు.

అయితే తన మంచిని కోరేవారిని తాను గుండెల్లో పెట్టుకున్నారని, అందుకే అభిమానులు ఆదరించే చిత్రాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభిమానుల ప్రేమనే ప్రధానంగా భావిస్తానన్నారు. వారి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. ఇప్పుడు దక్షిణాది ఉత్తరాది చిత్రాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడం శ్రమగా మారిందన్నారు. అదే సమయంలో అభిమానుల ప్రేమ కోసం తాను తన నిద్రకే గుడ్ బై చెబుతున్నానని నటి రష్మిక మందన్నా.

## ప్రభాస్ ఫౌజిలో యువరాణి?



ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో జరుగుతోంది. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ ఓ కీలక పాత్రలో అతిథిగా మెరవనున్నారనే టాక్ వినిపిస్తోంది.

పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆలియా ఓ యువరాణి పాత్ర చేయనున్నారని భోగట్టా. సినిమాలో కీలకంగా ఉండే ఈ పాత్ర కోసం చిత్రయూనిట్ ఆమెను సంప్రదించగా, ఆమె కూడా పచ్చజెండా ఊపారని బాలీవుడ్ టాక్. మరి 'ఫౌజి'లో ఆలియా భట్ అతిథి పాత్రలో నటిస్తారా? లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' (2022) చిత్రంలో రామ్‌చరణ్‌కి జోడీగా ఆలియా భట్ నటించిన సంగతి తెలిసిందే. ఇక జయప్రద, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ఫౌజి'కి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

## స్పిరిట్‌లో విష్ణు



'స్పిరిట్ సినిమా కోసం స్పెషల్ అప్లికేషన్ పెట్టుకున్నారు హీరో మంచు విష్ణు. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న మూవీ 'స్పిరిట్'. ఈ చిత్రంలో తొలిసారిగా పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు ప్రభాస్. ఈ వేసవిలో 'స్పిరిట్' సినిమా చిత్రీకరణను ప్రారంభించనుంది యూనిట్. దీంతో నటీనటుల కోసం 'ఎక్స్'లో ఓ నోట్‌ను షేర్ చేసింది.

"ఫిల్మ్ అండ్ థియేటర్ బ్యాక్‌గ్రౌండ్‌లో అనుభవం ఉన్న నటీనటులు మా సినిమాలో యాక్ట్ చేసేందుకు అప్లికేషన్స్ పెట్టుకోవచ్చు అంటూ కొన్ని షరతులతో 'స్పిరిట్' టీమ్ ఓ నోట్‌ను షేర్ చేసింది. ఈ నోట్‌ను 'ఎక్స్'లో షేర్ చేసి, తాను 'స్పిరిట్' సినిమా కోసం అప్లికేషన్ పెట్టుకున్నానని, ఏం జరుగుతుందో చూడాలన్నట్లుగా విష్ణు మంచు పేర్కొన్నారు.

మరోవైపు విష్ణు మంచు హీరోగా నటిస్తున్న 'కన్నప్ప'లో రుద్రగా ప్రభాస్ ఓ గెస్ట్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. మరి... ప్రభాస్ 'స్పిరిట్' లో నటించే చాన్స్ విష్ణు మంచుకు దక్కుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.



గత సంవత్సరం టి20 ప్రపంచ కప్‌లో విజయం తర్వాత రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు పెద్దగా చెప్పుకోదగ్గ విజయాలు సాధించలేదు. ఈ నేపథ్యంలో దుబాయ్, పాకిస్తాన్‌లలో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీపై భారత్ గురి పెట్టింది. తమ తొలి మ్యాచ్‌లో భారత్ ఈ నెల 20వ తేదీన బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో పెద్ద సవాలును ఎదుర్కోబోతోంది

ఈ టోర్నమెంట్ కోసం భారత క్రీడాకారులు ఇప్పటికే దుబాయ్ చేరుకున్నారు. భారత్ జట్టు ఎంపికపై పెద్దగా వివాదం లేకపోయినా, జట్టులోని ప్రధాన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వెన్ను నొప్పితో టోర్నమెంట్ కి దూరం కావడంతో అతని స్తానం లో జట్టులోకి వచ్చిన ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాపైనే ఆసక్తి రేకెత్తుతోంది

### ఇంగ్లాండ్ సిరీస్‌లో రాణించిన రాణా

ఇక రాణా విషయానికొస్తే, ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు రోహిత్ ఈ విషయం పై స్పష్టత ఇచ్చాడు. "బుమ్రా లేని కారణంగా జట్టు ఫాస్ట్ బౌలింగ్ కి కొత్తదనం కావాలి. రాణాలో మాకు ఆ సామర్థ్యం కనిపించింది. ఇంగ్లాండ్ సిరీస్ మొదటి మ్యాచ్‌లో రాణా తన తొలి ఓవర్లో 11 పరుగులు ఇచ్చాడు. రెండవ ఓవర్ మెయిడెన్ వేసిన తర్వాత మూడవ ఓవర్‌లో ఫిల్ సాల్ట్ ఏకంగా 26 పరుగులు సాధించాడు. అయితే సాల్ట్ అవుటైన తర్వాత మళ్ళీ బౌలింగ్ కి వచ్చిన రాణా వెంటనే తన 6'2" అడుగుల ఎత్తుని అనువుగా ఉపయోగించుకొని ప్రతి దాడి చేసాడు.

# రాణా మెరుపులు మెరిపిస్తాడా?

### సిరాజ్‌ను మినహాయించడం ఆశ్చర్యకరం

సిరాజ్‌ను జట్టు నుంచి మినహాయించడం చాలా ఆశ్చర్యకరం కలిగించింది. సిరాజ్ ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు మేనేజిమెంట్ ఆశించిన స్థాయిలో రాణించకపోయినప్పటికీ, మరీ దారుణంగా విఫలం కాలేదు. పైగా రాణా తో పోలిస్తే సిరాజ్ చాలా అనుభవం గడించాడు. సిరాజ్ ఇప్పటివరకు 44 వన్డేలు ఆడాడు. 24.04 సగటు తో 5.18 ఎకానమీతో 71 వికెట్లు పడగొట్టాడు.

సిరాజ్ దాదాపు 2022 ప్రారంభం నుండి 2024 చివరి వరకు భారత్ తరపున వన్డే ల్లో అత్యధిక వన్డే వికెట్లు తీసిన బౌలర్‌గా ఖ్యాతి గడించాడు. ఈ నేపథ్యంలో జట్టు మేనేజిమెంట్ కి సిరాజ్ స్థానంలో రాణా ఎందుకు మెరుగ్గా కనిపించాడు..?

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తాత్కాలిక జట్టుని ప్రకటించిన సందర్భంగా కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ .."సిరాజ్ ఆడకపోవడం దురదృష్టకరమని అన్నాడు. బుమ్రా లేకపోవడంతో డెత్-బౌలింగ్ నైపుణ్యం ఉన్న ఎడమచేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ అవకాశం కల్పించామని తెలిపాడు. షమీ ఫిట్‌నెస్ సాధించడంతో సిరాజ్ కి చోటు కల్పించలేక పోయామని చెప్పాడు. అయితే సిరాజ్ డెత్ బౌలింగ్ సరిగ్గా చేయలేకపోయిన కారణంగానే జట్టుకి దూరమయ్యాడనేది వాస్తవం.

140%ఎజూప్త్ర% కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేసి తన ప్రభావం చూపడం ప్రారంభించాడు. బెన్ డకెట్‌ను అవుట్ చేసి వన్డేల్లో తన తొలి వికెట్‌ను నమోదు చేసుకున్నాడు. 22 ఏళ్ల వయసులో ఉన్న రాణా తన నైపుణ్యానికి ఇంకా మెరుగులు దిద్దు కుంటున్నాడు. పేస్ బౌలర్ గా రాణించడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ లో రాణా చెప్పుకోదగ్గ రీతిలో రాణించాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ లో ఎలా రాణిస్తాడన్నదాని పైనే జట్టులో రాణాని కొనసాగించడం ఆధారపడి ఉంటుంది.

ఈ దశలోనే సిరాజ్ కి భారత్ జట్టు ద్వారాలు మూసుకొని పోయాయని చెప్పడం కష్టమే. బుమ్రా, షమీ లను మినహాయిస్తే సిరాజ్ ని సవాలు చేయగల సత్తా ప్రస్తుత భారత్ జట్టులో చాలా తక్కువ మందికి ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ బెంచ్ సభ్యులలో ఒకడైన సిరాజ్ మళ్ళీ త్వరలోనే జట్టులోకి వస్తే ఆశ్చర్యం లేదు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ లో రాణా ఎలా రాణిస్తాడనేదే ప్రస్తుతం ఆసక్తి కలిగించే విషయం.

# టీ20ల్లో అరుదైన మైలురాయిని తాకిన టీమిండియా కెప్టెన్

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, మహిళల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సారధి అయిన హర్మన్‌ప్రీత్ కౌర్ పొట్టి క్రికెట్‌లో అరుదైన మైలురాయిని తాకింది. హర్మన్.. భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్, డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ సారధి అయిన స్మృతి మంధన తర్వాత టీ20ల్లో 8000 పరుగుల మైలురాయిని తాకిన రెండో భారత మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది.


డబ్ల్యూపీఎల్-2025లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో నిన్న (ఫిబ్రవరి 15) జరిగిన ఉత్కంఠ పోరులో హర్మన్ ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌కు ముందు 8000 పరుగులు పూర్తి చేసేందుకు హర్మన్‌కు 37 పరుగులు అవసరమయ్యాయి. ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో హర్మన్ 8000 పరుగుల మైలురాయిని చేరుకుంది. ఈ మ్యాచ్‌లో హర్మన్ సుడిగాలి ఇన్నింగ్స్ ఆడింది. 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 42 పరుగులు చేసింది.



**టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన భారత మహిళా క్రికెటర్లు..**

| | |
|---|---|
| స్మృతి మంధన- 8349 | షఫాలీ వర్మ- 4542 |
| హర్మన్‌ప్రీత్ కౌర్- 8005 | మిథాలీ రాజ్- 4329 |
| జెమీమా రోడ్రిగెజ్- 5826 | దీప్తి శర్మ- 3889 |

# జాతీయ రికార్డు బద్దలు కొట్టిన యువ అథ్లెట్



న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ బోస్టన్‌లో జరిగిన ఇన్విటేషనల్ టోర్నీలో జాతీయ రికార్డు నెలకొల్పాడు. 3000 మీటర్ల ఇండోర్ రేసులో గుల్వీర్ సింగ్ 7 నిమిషాల 38.26 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. తద్వారా 16 ఏళ్ల క్రితం సురేందర్ సింగ్ (7:49.47) నెలకొల్పిన రికార్డును గుల్వీర్ బద్దలు కొట్టాడు. 2022 హాంగ్జూ ఆసియా క్రీడల 10,000 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించిన గుల్వీర్... సీజన్ ఆరంభంలోనే రికార్డు నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు.

'సీజన్ తొలి ఇండోర్ టోర్నీలోనే మంచి ప్రదర్శన కనబర్చడం సంతోషంగా ఉంది. దీంతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. ఈ స్ఫూర్తితో ఔట్ డోర్ ఈవెంట్‌లలోనూ సత్తా చాటుతా' అని 26 ఏళ్ల గుల్వీర్ పేర్కొన్నాడు.

# జాతీయ కోచ్‌గా భారత దిగ్గజ షూటర్

భారత దిగ్గజ షూటర్ జస్పాల్ రాణా తిరిగి కోచ్‌గా జాతీయ షూటింగ్ జట్టుతో చేరాడు. భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ).. జస్పాల్ రాణాను 25 మీటర్ల పిస్టల్ విభాగానికి 'హై పెర్ఫార్మెన్స్' కోచ్‌గా నియమించింది. అతడితో పాటు మాజీ ఆటగాడు జీతు రాయ్‌ను కూడా కోచింగ్ బృందంలో భాగం చేసింది.



జీతూ ఆటగాడిగా ఆసియా క్రీడల్లో రెండు, కామన్వెల్త్ క్రీడల్లో రెండు పతకాలు గెలవడంతో పాటు ఆరు వరల్డ్ కప్ పతకాలు సాధించింది. అతని ఖాతాలో వరల్డ్ చాంపియన్‌షిప్ రజతం కూడా ఉంది. తొలి సారి అతను కోచ్‌గా బాధ్యతలు చేపడుతున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జీతూ రాయ్ శిక్షణ ఇవ్వనున్నాడు.

రైఫిల్ విభాగానికి హెడ్ కోచ్‌గా ఇటీవల ద్రోణాచార్య అవార్డు దక్కించుకున్న దీపాలీ దేశ్‌పాండేను ఎంపిక చేసింది. మొత్తంగా ఎన్ఆర్ఏఐ 16 మంది కొత్త కోచ్‌లను ఎంపిక చేసింది. వీరితో పాటు ఇప్పటికే ఉన్న 19 మందిని కూడా కొనసాగించనున్నారు.

# జింబాబ్వేపై ప్రతీకారం తీర్చుకున్న ఐర్లాండ్



తొలి వన్డేలో జింబాబ్వే చేతిలో ఎదురైన పరాభవానికి ఐర్లాండ్ ప్రతీకారం తీర్చుకుంది. ఇవాళ (ఫిబ్రవరి 16) జరిగిన రెండో వన్డేలో ఐర్లాండ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 49 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. వెస్లీ మెదెవెరె (61), సికందర్ రజా (58) అర్ధ సెంచరీలతో రాణించి జింబాబ్వేకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు.

వెల్లింగ్టన్ మసకడ్జ (35), బ్రియాన్ బెన్నెట్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేయగా.. బెన్ కర్రన్ (18), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (4), జోనాథన్ క్యాంప్‌బెల్ (2), టి మరుమణి (0), ముజరబానీ (0), ట్రెవర్ గ్వాండు (2) నిరాశపరిచారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అదైర్ నాలుగు, కర్టిస్ క్యాంఫర్ మూడు వికెట్లు తీసి జింబాబ్వే పతనాన్ని శాశించారు. హ్యూమ్, జాషువ లిటిల్, ఆండీ మెక్‌బ్రైన్ తలో వికెట్ పడగొట్టారు.

246 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఐర్లాండ్.. 48.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (89), వన్‌డౌన్ బ్యాటర్ కర్టిస్ క్యాంఫర్ (63) అర్ధ సెంచరీలతో రాణించి ఐర్లాండ్ విజయానికి గట్టి పునాదాలు వేశారు. లోర్కాన్ టక్కర్ (36 నాటౌట్), జార్జ్ డాక్రెల్ (20 నాటౌట్) ఐర్లాండ్‌ను విజయతీరాలకు చేర్చారు.

ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో ఆండ్రూ బల్బిర్నీ (11), హ్యారీ టెక్టార్ (7) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. జింబాబ్వే బౌలర్లలో గ్వాండు 2, నగరవ, ముజరబానీ తలో వికెట్ పడగొట్టారు. ఈ గెలుపుతో ఐర్లాండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో జింబాబ్వే ఆధిక్యాన్ని 1-1కి తగ్గించింది. ఈ సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో వన్డే ఫిబ్రవరి 18న జరుగనుంది.